పోరాడే వారికే పట్టం కట్టండి

- ప్రజలను విభజించి పాలిస్తున్న ఆ మూడు పార్టీలు
- బిఆర్ఎస్‌కు ఓటు వేస్తే బిజెపికి వేసినట్టే
- భద్రాద్రి గొంతుక కారం పుల్లయ్యను అసెంబ్లీకి పంపించండి
- త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్

ప్రసంగిస్తున్న మాణిక్ సర్కార్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యలపై పోరాడే వారికే పట్టం కట్టి, భద్రాచలం గొంతుక కారం పుల్లయ్యను అసెంబ్లీకి పంపించాలని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ ప్రజలకు పిలుపునిచ్చారు. బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ప్రజలను విభజించి పాలించాలని చూస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ సర్కార్ బి టీంగా వ్యవహరిస్తోందని, బిఆర్ఎస్‌కు ఓటు వేస్తే బిజెపికి వేసినట్టేనని అన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి అధికారంలోకి వచ్చాక ఆదివాసీలపై అనేక రకాల దాడులను ఎక్కువ య్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్య విజయాన్ని కాంక్షిస్తూ శనివారం భద్రాచలం పట్టణంలో మాణిక్ సర్కార్ రోడ్ షో నిర్వహించారు. బ్రిడ్జి సెంటర్ చెక్‌పోస్టు పాయింట్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలు కూడా అక్రమంగా సంపాదించిన సంపాదనతో ఎన్నికల్లో గెలవాలని కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజలు ఎంతో చైతన్యవంతులు కాబట్టే 30 ఏళ్లుగా భద్రాచలంలో ఎర్రజెండా రెపరెపలాడిందని గుర్తు చేశారు. మరోసారి ప్రజల చైతన్యాన్ని చూపించే సమయం వచ్చిందని, ఆదివాసీ, ఏజెన్సీ గడ్డపై మతోన్మాద విషం జిమ్మకుండా ఉండాలంటే ఎర్రజెండా పార్టీలను ప్రజలు గెలిపించాలని కోరారు. మిడియం బాబురావు ఎంపిగా ఉన్న సమయంలో ఈ ప్రాంత సమస్యలపై పార్లమెంటులో చర్చించి ఆదివాసీలకు అటవీ హక్కుల చట్టాన్ని సాధించారని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన సున్నం రాజయ్య, కొంజా బొజ్జి తమ పదవీ కాలం మొత్తం మచ్చలేని పరిపాలన అందించి, ఈ ప్రాంత అభివృద్ధిలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కరోనా కష్టకాలంలో సిపిఎం కార్యకర్తలు తమ ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించారని, అటువంటి పార్టీకి ఓటు వేసి అసెంబ్లీకి పంపిస్తే భద్రాచలం నియోజకవర్గం సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. భద్రాచలం అభ్యర్థి కారం పుల్లయ్య మాట్లాడుతూ ఐదేళ్లుగా నిలిచిపోయిన అభివృద్ధిని పున: ప్రారంభించాలంటే ఈ ఎన్నికల్లో సిపిఎం గెలిచి తీరాలన్నారు. రోడ్ షోకి పట్టణం నుంచి ప్రజలు తరలివచ్చి బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ డోలు, కోయలు, తీన్మార్ డాన్సులతో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రోడ్ షోలో మాజీ ఎంపి మీడియం బాబూరావు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఎజె రమేష్, సీనియర్ నాయకులు ఎల్లమంచిలి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆ మూడు పార్టీలకు బుద్ధి చెప్పండి

బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్‌లనుంచి దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలంతా ఎర్రజెండా పట్టుకుని పోరాడాలని త్రిపుర మాజీ సీఎం, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ కోరారు. భద్రాచలం నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి కారంపుల్లయ్య గెలుపును కాంక్షిస్తూ ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపురంలో శనివారం కొప్పుల రఘుపతి అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో మాణిక్ సర్కార్ మాట్లాడుతూ.. దేశాన్ని విభజించి పాలించే రీతిలో బిజెపి వ్యవహరిస్తోందన్నారు.

దానికి తగ్గట్టుగానే కాంగ్రెస్ వ్యవహరిస్తోందన్నారు. గతంలో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి అటవీ హక్కుల చట్టం సాధించుకున్నామని గుర్తు చేశారు. అయితే ఆ చట్టం అమలులో కాంగ్రెస్, తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. ఆ దారిలోనే బిఆర్ఎస్ ప్రభుత్వ విధానం ఉందన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఎంతమంది గిరిజనులకు హక్కుపత్రాలు ఇచ్చారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపాలని కోరారు. కారం పుల్లయ్యను గెలిపించాలని పిలునిచ్చారు. ఎర్రజెండా వ్యక్తులను అసెంబ్లీకి పంపితే ప్రజాస్వామ్య హక్కులకై నిలబడుతారన్నారు. దేశాన్ని విభజించి పాలించు అన్న యోచనలో బీజేపీ కులమతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందని అన్నారు. షెడ్యూల్ కులాలకు ఇచ్చిన హామీలను నిలుపు కోవడంలో కేసీఆర్ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శిసభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, అభ్యర్థి కారం పుల్లయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, సూడి కృష్ణా రెడ్డి, మచ్చా వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

పిసిసి ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్‌గా సూర్యనాయక్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా పార్టీ సీనియర్ నేత సూర్యనాయక్‌ను నియమిస్తూ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. ఆయనతోపాటు వాసుదేవరెడ్డి, సయ్యద్ కైసర్, పృథ్వీనాయక్‌లను నియమించారు.

ప్రియాంక గాంధీ మాటలు హాస్యాస్పదం

- జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ప్రధాని పివిపై ప్రియంక గాంధీ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. పివి నరసింహరావును బతికుండగానే కాకుండా, చనిపోయిన తరవాత కూడా అవమానించారని ఆరోపించారు. ఓట్ల కోసం పివి గురించి చిలక పలుకులు పలుకుతోందని విమర్శించారు. పివికి కాంగ్రెస్ చేసిన అవమానాన్ని తెలంగాణ ప్రజలు మర్చిపోరని అన్నారు. పివి చనిపోతే ఢిల్లీలో ఆయన అంత్యక్రియలు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. పివి నరసింహారావు కీర్తి, ప్రతిష్టలను గుర్తించిన బిఆర్ఎస్ పార్టీ నెక్లెస్ రోడ్డులో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ పివి కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కమ్యూనిస్టులకే ఆదివాసీల ఆదరణ

- అశ్వారావుపేటలో సిపిఎం జాతీయ నాయకులు వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమ్యూనిస్టులను అత్యధికంగా ఆదరించేది ఆదివాసీలేనని, వీరి కోసం పనిచేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఎం జాతీయ నాయకులు వెంకట్ అన్నారు. గిరిజనుల, సంఘటిత, అసంఘటిత కార్మికులు, కర్షకుల, శ్రామికుల సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పనిచేసే సిపిఎం అభ్యర్థి అర్జున్‌రావు పిట్టలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అశ్వారావుపేట మండలం దబ్బతోగులో పార్టీ మండల కమిటీ సభ్యులు సోడెం ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. సిపిఎం అభ్యర్థులు గెలిస్తే కేరళ మోడల్‌లో పరిపాలన చేసే అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులు ధన అహంకారం ప్రదర్శిస్తూ ఓటుకు నోటు బేరం చేస్తున్నాయని, ఇలాంటి పార్టీలను ఓడించాలని తెలిపారు. గ్రామానికి చేరిన బి.వెంకట్‌కు ముందుగా ఘనస్వాగతం పలికారు.

ప్రజల బాధలను పట్టించుకోని బిఆర్ఎస్

- ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ

రోడ్ షోలో పాల్గొన్న ప్రియాంక గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రజల బాధలను బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. సంపదను ప్రజలకు పంచే కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో వస్తుందని ఆమె చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ప్రియాంక గాంధీ రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తుమ్మల నాగేశ్వరరావు, డా. మట్టా రాగమయిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మధిరలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు భట్టివిక్రమార్క అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. ప్రత్యేక రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. తెలంగాణ సంపదను పంచుకోవడంలో బిఆర్ఎస్ నేతలు నిమగ్నమయ్యారు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు తప్పనిసరిగా అమలు చేసే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఇల్లు నిర్మించుకుంటే ఆర్థిక సాయం చేస్తామన్న హామీని బిఆర్ఎస్ నెరవేర్చలేదన్నారు. రైతులకు రుణామఫీ అమలు కాలేదనీ, నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారనీ, పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్యు లు సతమతమవుతున్నారని తెలిపారు. దేశంలో ప్రజలే నాయకులని స్పష్టంచేశారు. అయితే, ప్రజలకంటే అతీతులం అన్నట్టు మోడీ, కెసిఆర్ భావిస్తున్నారని తెలిపారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో యువతకు ఉద్యోగాలు లేవు కానీ కెసిఆర్ కుటుంబ సభ్యులంతా మంత్రులయ్యారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ నేతలందరికీ వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు ఉన్నాయన్నారు. సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీఇచ్చారు. మధిర నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. వంద మంది కెసిఆర్‌లు వచ్చినా తనను ఓడించలేరని ధీమా వ్యక్తం చేశారు. మధిర పోరాటాల పురిటిగడ్డ.. సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన గడ్డ అని చెప్పారు. ఫ్యూడల్ ప్రభుత్వమైన బిఆర్ఎస్‌ను బంగాళాఖాతంలో కలపాలని, ప్రజల సర్కార్‌ను అధికారంలోకి తీసుకురావాలని ఓటర్లను కోరారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర ఘటన నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్ ఐ కె.గోపి తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన శివరాత్రి రిబిక(17) సెయింట్ ఎలిజబెత్ స్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. పదేండ్ల క్రితమే ఆమె తల్లి దండ్రులు చనిపోగా..అప్పటి నుంచి తన పిన్ని దగ్గర ఉంటూ చదువుకుంటున్నది. తల్లిదండ్రులను గుర్తు చేసు కుంటూ మానసిక వేదనతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్ప డినట్టు ఆమె పిన్ని తెలిపారు. పిన్ని శివరాత్రి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి

- మిత్రపక్షాల సమన్వయ కమిటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నియంతృత్వ బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని మిత్రపక్షాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆ కమిటీ నేతలు మహేష్ కుమార్, కోదండరెడ్డి (కాంగ్రెస్), చాడ వెంకట్‌రెడ్డి, బాలమల్లేష్, ఈటి నరసింహ (సిపిఐ), కోదండరాం, పిఎల్ విశ్వేశ్వరరావు (టిజెఎస్) విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్, సిపిఐ, టిజెఎస్ పార్టీలు కలిసి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయన్నారు. పార్టీల కలయికతో బిఆర్ఎస్‌ను ఓడిస్తున్నట్టు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో ఉమ్మడిగా ప్రచారం చేస్తున్నామన్నారు. కొత్తగూడెంలో సిపిఐని, మిగతా ప్రాంతాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని చాడ వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE: BAPATLA.
I.A. No. 74/2023
O.S. No.62/2015

Between:
Narendra Durga, W/o. Srinivasa Rao, age 42 years, R/o Railpet, Bapatla, SCJC Bapatla
.....PETITIONER/ PLAINTIFF
Vs
1)Meeesala Sarojini (died)
2)Challa Srinivasa Rao (D2) S/o. Challa Venkateswara Rao, age 32 years, R/o Dr. No.25-10-28, 1stLine,Srinivasaraopeta, Guntur Town, Guntur District, SCJC Guntur.
3)Meesala Venkateswara Rao S/o. Appa Rao, age 40 years, Loco Pilot (Train Driver), R/o. Near Indira Gandhi Statue, Railpet, Bapatla Town, Mandal and District, JCJC Bapatla.
4) Meesala Manalika @ Nirmala, D/o. Appa Rao, age 44, House-wife, R/o.Kukatpally,Hyderabad, Telangana State. Cell: 8074538997.
5)Meesala Nagamani, D/o. Appa Rao,age35, Private Employee, R/o Kukatpally, Hyderabad, Telangana State. Cell: 8074538997 ....Defendents

ఈ నెంబరు దావాలో మొదటి ప్రతివాది 24-9-2021న చనిపోయినారు. వీరి తాలుకు వారసులను దావాలో పార్టీలుగ చేర్చుమని రెస్పాండెంట్స్ 3 to 5 లను I.A. No. 74/2023 పిటిషన్ దాఖలు చేసి యున్నారు. అందులో రెస్పాండెంట్స్ R3 to R5 లకు Notice నిమిత్తం ది: 30-11-2023 నకు వాయిదా అయియున్నది. మీరు ఆ రోజు ఉదయం 10-30 గంటలకు స్వయముగ గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపు కోవలెను. లేని యెడల మిమ్మల్ని Expartee చేసి పరోక్షముగ తీర్మానించబడును.

వాయిదా తేది : 30-11-2023

ఇట్లు
పిటీషనరు తరుపు అడ్వకేట్
I. Bala Krishna
Advocate, Bapatla.
Cel No: 8639081383

ఎమ్మెల్యేలను కొనే చరిత్ర కెసిఆర్‌ది

- రైతులకు ఎన్ని గంటలు కరెంటు కావాలో ఆ రాష్ట్రానిదే నిర్ణయం
- కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే చరిత్ర సిఎం కెసిఆర్‌దేనని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ విమర్శించారు. గత రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొని విజయం సాధించారని తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు దేశానికి కవలపిల్లలు అన్నారు. వేరే పార్టీలు ఎమోషన్స్‌తో పాలిటిక్స్ చేస్తాయన్నారు. కర్ణాటకలో పాలన సెక్రటేరియట్ నుంచి నడిస్తే, తెలంగాణలో మాత్రం ఫామ్ హౌజ్ నుంచి పాలన నడుస్తోందన్నారు. రైతులకు ఎన్ని గంటల కరెంట్ కావాలో ఆ రాష్ట్రానిదే నిర్ణయమన్నారు. కర్ణాటకలో ఐదారు గంటలు సరిపోతుందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో విలేకర్లతో ఇష్టాగోష్టిలో మాట్లాడారు. ప్రపంచమంతా తెలంగాణ ఎన్నికల వైపు చూస్తోందన్నారు. బిఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. తెలంగాణలోని పలు నియోజకవర్గాల్లో తాను తిరిగాననీ, ప్రజలు మార్పు కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. తెలంగాణ విషయంలో కర్ణాటక హృదయంతో ఆలోచిస్తోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ వస్తే, సిఎం అభ్యర్థి విషయంలో అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అన్నారు. 'చంద్రబాబు, వైఎస్సార్ హైదరాబాద్ అభివృద్ధి కోసం పాటు పడ్డారు. కెసిఆర్, కెటిఆర్‌కు రిక్వెస్ట్... కర్ణాటక విషయాలు తెలుసుకోండి. అరగంటలో కర్ణాటక వచ్చి అక్కడ అమలవుతున్న పథకాల గురించి తెలుసుకోవచ్చు. కర్ణాటక ప్రజలకు ఐదు గ్యారంటీలు అమలు అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నేషనల్ పార్టీ. మా పార్టీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఉంది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో అవసరం ఉంటుంది. రాష్ట్ర ప్రజలకు అనుగుణంగా పథకాలు ఉంటాయి. రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే బిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానంటూ కెసిఆర్ మాట తప్పారు. కర్ణాటక రైతులకు మేం ఉచిత కరెంట్ ఇవ్వడం ప్రారంభించాం. తెలంగాణతో పోల్చితే కర్ణాటక పెద్ద రాష్ట్రం. కరెంట్ విషయంలో తెలంగాణ కంటే మేం మెరుగ్గా ఉన్నాం. కెసిఆర్ ఒక అబద్ధాల కోరు' అని విమర్శించారు.

ఊసరవెల్లి రాజకీయ నాయకులను ఓడించండి

సిపిఎంది డబ్బు యాత్ర కాదు... పోరాటాల యాత్ర : బృందా కరత్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఊసరవెల్లిలా రంగులు మార్చే రాజకీయ నాయకుల మాటలు నమ్మొద్దని, వారికి డబ్బు మాత్రమే ఉందని, ఒక సిద్ధాంతం, నీతి, నిజాయితీ లేదని, అలాంటి వారిని ఓడించాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ అన్నారు. సిపిఎం వైరా నియోజకవర్గ అభ్యర్థి భూక్యా వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ శనివారం వైరా, కొణిజర్ల మండల కేంద్రాల్లో ఆమె రోడ్ షో నిర్వహించారు. వైరా రింగ్ రోడ్డు వద్ద సభలో మాట్లాడారు. సిపిఎంది డబ్బు యాత్ర కాదని, తెలంగాణ అసెంబ్లీలో సిపిఎం ప్రతినిధి ఉండాలనే ఒకే ఒక సందేశంతో చేస్తున్న పోరాటాల యాత్రని తెలిపారు. అటవీ హక్కుల చట్టం కోసం పోరాడింది సిపిఎం మాత్రమేనని గుర్తు చేశారు. అటవీ భూములను అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని బిజెపి చూస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి పోడుపట్టాలు ఇచ్చే ఉద్దేశం లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 20 వేల మందికి పోడు పట్టాలు ఇవ్వాల్సి ఉండగా, నాలుగు వేల మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొని నమ్మకద్రోహం చేసిందని విమర్శించారు. గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించి రైతులకు సాగునీరు అందించాలని సిపిఎం నాయకులు తమ్మినేని వీరభద్రం మహాజన పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. రైతులకు మంచి చేయాలనే ఉద్దేశం బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఉంటే ఇప్పటివరకు సీతారామ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. బిజెపి ప్రభుత్వం అన్ని రంగాలను ప్రయివేటుపరం చేస్తోందని తెలిపారు. ఆ పార్టీకి రాజ్యాంగం పట్ల నమ్మకం లేదని, మతాన్ని నమ్ముకుందని, ప్రజలను విభజించడానికి మతాన్ని వాడుతోందని అన్నారు. ఆరు గ్యారంటీల గురించి మాట్లాడుతున్న పార్టీకి గ్యారెంటీ లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణకు పోరాటాల చరిత్ర ఉన్నదని, ఎర్రజెండా చేతబట్టుకొని ప్రజలతో మమేకమై తిరుగుతూ ప్రజలతో కలిసిపోయి, ప్రజల మధ్య ఒకడిగా ఉంటూ పోరాటాలు నడుపుతున్న భూక్యా వీరభద్రంను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రముఖ విద్యావేత్త ఐవి.రామణారావు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE: BAPATLA.
I.A. No. 73/2023
O.S. No.62/2015

Between:
Narendra Durga, W/o. Srinivasa Rao, Hindu, age 42 years, R/o Railpet, Bapatla, SCJC Bapatla
.....PETITIONER/ PLAINTIFF
Vs
1)Meeesala Sarojini (died)
2)Challa Srinivasa Rao (D2) S/o. Challa Venkateswara Rao, Hindu, age 32 years, R/o Dr. No.25-10-28, 1stLine,Srinivasaraopeta, Guntur Town, Guntur District, SCJC Guntur.
3)Meesala Venkateswara Rao S/o. Appa Rao, Hindu, age 40 years, Loco Pilot (Train Driver), R/o. Near Indira Gandhi Statue, Railpet, Bapatla Town, Mandal and District, JCJC Bapatla.
4) Meesala Manalika @ Nirmala, D/o. Appa Rao, Hindu, age 44, House-wife, R/o.Kukatpally,Hyderabad, Telangana State. Cell: 8074538997.
5)Meesala Nagamani, D/o. Appa Rao,Hindu, age35, Private Employee, R/o Kukatpally, Hyderabad, Telangana State. Cell: 8074538997.......Defendents

ఈ నెంబరు దావాలో మొదటి ప్రతివాది 24-9-2021న చనిపోయినారు. వీరి తాలుకు వారసులను దావాలో పార్టీలుగ చేర్చుమని దఖలు చేయుటలో జరిగిన Abatement order ను set aside చేయమని పిటీషన్ I.A. No. 73/2023 దాఖలు చేసి యున్నారు. అందులో రెస్పాండెంట్స్ R3 to R5 లకు Notice నిమిత్తం ది:30-11-2023 నకు వాయిదా అయి యున్నది. మీరు ఆరోజు ఉదయం 10-30 గంటలకు స్వయముగ గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపు కోవలెను. లేని యెడల మిమ్మల్ని Expartee చేసి పరోక్షముగ తీర్మానించబడును.

వాయిదా తేది : 30-11-2023

ఇట్లు
పిటీషనరు తరుపు అడ్వకేట్
I.Bala Krishna
Advocate, Bapatla.
Cel No: 8639081383.



గంప గుత్త బేరాలు

- ఊర్లకు ఊర్లే కొనుగోలు
- సామూహిక ప్రమాణాలు
- ట్రెండ్ మార్చిన నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఎన్నికల సమరం తుది అంకానికి చేరుకున్న వేళ అంది వచ్చిన ఏ అవకాశాన్నీ రాజకీయ పార్టీలు వదులుకోవడం లేదు. ఓటర్లను ప్రసన్నం చేసు కోవడం, లేదా ప్రలోభ పెట్టడం చాలా ఎన్నికల్లో చూసాం. కానీ ఈసారి రాజకీయ పార్టీలు కొత్త తరహా పంథాకు శ్రీకారం చుట్టాయి. విలువలకు పాతరేసి గంప గుత్త బేరాలు మొదలుపెట్టాయి. ఊళ్ళకు ఊళ్ళనే నేతలు కొనుగోలు చేస్తున్నారు. ఓటర్లను అంగట్లో సరుకుల మాదిరి గా తయారు చేస్తున్నారు. "ఆ ఊర్లో ఇతర పార్టీల జెండాలు ఎగరకూడదు... వందకు వంద శాతం ఓట్లు మన పార్టీకే పడాలి"...ఇది ఆయా గ్రామాల ప్రజలకు సదరు పార్టీకి మధ్య ఒప్పందం. ఇందుకోసం ఆ గ్రామాల్లోని రచ్చబండల దగ్గర సామూహిక ప్రమాణాలు చేయిస్తున్నా రు. తెలంగాణ ఎన్నికల్లో వచ్చిన ఈ కొత్త పోకడ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది.

"మనసా... వాచా.. కర్మణా ప్రమాణం చేస్తున్నాం. గ్రామ శ్రేయస్సు కోసం, గ్రామ అభివృద్ధి కోసం ఫలానా పార్టీకి ఓటేస్తున్నాం.

గ్రామంలోని ప్రజలందరూ తమ వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి సమిష్టిగా తీసుకున్న నిర్ణయం ఇది" తెలంగాణ ఎన్నికల్లో మొదలైన కొత్త పోకడ ఇది. గతంలో వ్యక్తులు, కుటుంబాలు, కుల సంఘాల ఓట్లను రాజకీయ పార్టీలు కొనుగోలు చేసేవి. అయితే ఇప్పుడు ట్రెండ్ మార్చిన నేతలు అవకాశం ఉన్నచోట గ్రామాలకు గ్రామాలనే కొనుగోలు చేస్తున్నారు. వందకు వంద శాతం ఓట్లు తమకే పడేలా సామూహిక ప్రమాణాలు చేయిస్తున్నారు. ప్రతి గ్రామంలో భిన్న పార్టీలు ఉంటాయి. వ్యక్తుల మధ్య, పార్టీల మధ్య, వైరుధ్యాలుంటాయి. అలాంటప్పుడు ఇదెలా సాధ్యం? అన్న ప్రశ్న సహజం. అయితే ముందుగా గ్రామాల్లోని చోటా మోటా నేతలను, పార్టీల సభ్యులు, ఇతర కీలక నేతలను మచ్చిక చేసుకుంటున్నారు. ఆ తర్వాత కుల సంఘాల నాయకుల ను దారికి తెచ్చుకుంటున్నారు. అన్ని సక్రమంగా జరిగితే ఆ గ్రామా న్ని కొనుగోలు చేస్తున్నా "విడిగా ఓటుకు ఇంత అని ఇవ్వడంతో పాటు మీ గ్రామానికి ఇంత మొత్తాన్ని అందజేస్తాం. ఈ మొత్తాలు చాలా పెద్దవి. దాంతో గ్రామంలో రోడ్డు వేయించు కుంటారో, బడి కట్టించుకుంటారో, ఆస్పత్రి కట్టించుకుంటారో మీ ఇష్టం" అంటూ ఒప్పందం చేసుకుంటారు. కాని షరతు ఏమిటంటే గ్రామంలో వందకు వందశాతం ఓట్లు వారికే పడాలి. ఇందుకు కావలసిన గ్యారంటీని గ్రామంలోని ఫలానా వ్యక్తి దగ్గర ఉంచుతు న్నాం. ఇది గ్రామస్తులకు రాజకీయ పార్టీలకు మధ్య జరుగుతున్న ఒప్పందం. ఈ ఎన్నికల్లో సదరు పార్టీ అభ్యర్థి ఓడిపోయినా గెలిచినా సంబంధం లేదు. అనుకున్న ప్రకారం గ్రామ నిర్ణయానికి అనుగుణంగా ఓట్లు పడితే ఒప్పందం అమలవ్ుతుంది. అందుకు మీ గ్రామంలోని ఫలానా వ్యక్తి గ్యారెంటీ.. ఉత్తర తెలంగాణ లోని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో గత రెండు రోజుల నుంచి ఎంచుకున్న గ్రామాల్లో రాజకీయ పార్టీ లు ఈ తరహా బేరాలకు పాల్పడుతున్నాయని తెలుస్తోంది. ఎన్నికల్లో గెలుపొందేందుకు ఓటర్లను అంగట్లో సరుకుల మాదిరిగా తయారు చేస్తున్నారు. గతంలో ఊర్లలో వేలం పాటల నిర్వహించే వారు. అక్కడక్కడ కుల సంఘాలు ఇతర సమూహాలకు ఓపెన్ ఆఫర్ ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ట్రెండు మార్చి ఈ కొత్త పోకడలకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల్లో డబ్బు, మద్యంతో పాటు గంపగుత్తగా గ్రామాలను కొనుగోలు చేసే సంస్కృతి మొదలైంది. ఇది ప్రజా స్వామ్యానికి అంత శ్రేయస్సు కాదు. ఎన్నికల కమిషన్ ఇలాంటి సంఘటనలపై దృష్టి పెట్టి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పాతబస్తీలో బడా వ్యాపారులే టార్గెట్‌గా ఐటి సోదాలు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో మరోసారి ఐటి దాడులు కలకలం రేపుతున్నాయి. పాతబస్తీలో బడా వ్యాపారులే లక్ష్యంగా శనివారం తెల్లవారుజాము నుంచే ఐటి అధికారులు సోదాలు జరుపుతున్నారు. కోహినూర్ గ్రూప్స్ ఎండి మజీద్‌ఖాన్ ఇళ్లు, కార్యాలయాల్లో విస్తృతంగా తనిఖీలు జరుపుతున్నారు. కింగ్స్ ప్యాలెస్ యజమానుల ఇళ్లలోనూ సోదాలు చేస్తు న్నారు. కింగ్స్ గ్రూప్ ఓనర్ షానవాజ్ ఇంట ితోపాటు పలువురు ఇళ్లలో సోదాలు ని . కోహినూర్, కింగ్స్ గ్రూపుల పేరుతో ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు నిర్వహి స్తున్న ఈ వ్యాపారులు ఓ రాజకీయ పార్టీకి పెద్ద మొత్తంలో డబ్బులు సమకూర్చుతున్నట్లు అనుమానం రావడంతో దాడులకు దిగారు.మరోవైపు వికారాబాద్ జిల్లా తాండూరులో ఐటిఅధికారుల దాడులు చేపట్టారు. పట్టణంలోని శ్రీ దుర్గా గ్రాడ్యుర్ హోటల్, బార్ అండ్ రెస్టారెంట్‌పై ఐటీ సోదాలు జరుపుతున్నా రు. హోటల్ యజమాని శేఖర్ గౌడ్ హైదరాబా ద్ చెందిన వ్యక్తి కాగా.. యజమాని ద్వారా కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్ రెడ్డికి డబ్బులు మరుతా యని ఆరోపణల తో ఈ దాడులు నిర్వహిస్తున్నట్లుగా ప్రచారం.

కెటిఆర్‌కు ఇసి నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మంత్రి కెటిఆర్‌కు కేంద్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ ఎంపి రణదీప్ సూర్జేవాల ఫిర్యాదు ఆధారంగా ఇసి నోటీసులు ఇచ్చింది. టీ వర్క్స్‌లో జరిగిన స్టూడెంట్ ట్రైబ్‌లో చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొంది. "ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని 'టీ' వర్క్స్ భేటీలో విద్యార్థులకు కెటిఆర్ హామీ ఇచ్చారు. టిఎస్‌పిఎస్‌సిని ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. రాజకీయ కార్యకలాపాలకు ప్రభుత్వ ఆఫీసు 'టీ' వర్క్స్‌ను వాడుకున్నారు" అని సూర్జేవాల ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును పరిశీలించిన ఇసి... మంత్రి కెటిఆర్ ప్రాథమిక ఎన్నికల నియామవాళిని ఉల్లంఘించినట్టు అభిప్రాయపడింది. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల్లోగా దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసు జారీ చేసింది.

కెసిఆర్ పక్కా లోకల్

- రోడ్ షోల్లో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, జైన్లు అందరూ సంతోషంగా ఉన్నారు. తొమ్మిదిన్న రేండ్ల పాలనలో కేసీఆర్ మైనారిటీల సంక్షేమానికి రూ.12,780 కోట్లు ఖర్చు చేస్తే 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ రూ.930 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది." అని మంత్రి కెటిఆర్ తెలిపారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంతో పాటు కామారెడ్డి నియోజకవర్గం భిక్కనూర్‌లో శనివారం రోడ్‌షోలో పాల్గొని ప్రసంగించారు. బీఆర్‌ఎస్ పార్టీ, బీజేపీ రెండూ ఒకటేనని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని, కానీ ఇప్పటి వరకు కెసిఆర్ బిజెపితో పొత్తు పెట్టుకోలేదన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ, కెసిఆర్ గొంతు నిక్కాలని మోడీ–షా చూస్తున్నారని, తాము వాళ్లకు భయపడేదీ లేదని తెలిపారు. తల నరుకుంటాం కానీ ఢిల్లీ వాళ్లకు మెడ వంచబోమని స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బిజెపికి లాభం కలుగుతుందన్నారు. కామారెడ్డి నియోజకవర్గం భిక్కనూర్‌లో కెటిఆర్ మాట్లాడుతూ.. బిజెపి అభ్యర్థి ఇస్తున్న సలాకా సిమెంట్‌లకు ఓట్లు రావన్నారు. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టు కెసిఆర్ నాన్ లోకల్ కాదని, కోనాపూర్ గ్రామం ఆయన తల్లిగారి ఊరైనని, లోకలేనని తెలిపారు. నాయకులకు పైసలు ఆశ చూపి కొనుక్కోవడం రేవంత్ రెడ్డికి అలవాటేనని, రూ.50 లక్షలతో దొరికిన దొంగకు కామారెడ్డి ఓటర్లు ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. కొడంగల్‌లో ప్రజలు తరిమికొడితే కామారెడ్డిలో పోటీ చేస్తున్నారని, అక్కడ చెల్లని రూపాయి కామారెడ్డిలో చెల్లుతుందా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమానికి పురుడు పోసిన కామారెడ్డి జిల్లా ప్రజలు తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన కెసిఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

బిఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

- జూబ్లీహిల్స్ బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని జూబ్లీహిల్స్ బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని రాజీవ్‌నగర్‌లో శనివారం ఉదయం నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. సిఎం కెసిఆర్ నాయకత్వంలో నగరంలో గణనీయ అభివృద్ధి జరిగిందన్నారు. పార్కులు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధిని గోపీనాథ్ వివరించారు. బిఆర్‌ఎస్‌కు ఓటు వేసి మూడోసారి కెసిఆర్‌ను సిఎం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వినయ్‌సాగర్, స్థానికులు శర్మ,భుజంగరావు,మూర్తి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిసి సిఎం కావాల్సిందే

- బిసి రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే బిసి సామాజిక తరగతికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామన్న ప్రధాని మోడీకి సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని బిసి రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ శనివారం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రకటించారు. ప్రధాన పార్టీలన్నింటి కంటే ఎక్కువగా బీసీలకు 36 సీట్లు ఇవ్వడమే కాక, అధికారంలోకి వస్తే బీసీనే ముఖ్యమంత్రి చేస్తామన్న బిజెపిని ఆయన అభినందించారు. మీడియా సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బండారు పద్మావతి, పాల్గొన్నారు.

635 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 635 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పి చెన్నూరి రూపేష్ తెలిపారు. దీని విలువ దాదాపు రూ. మూడు కోట్ల వరకు ఉండొచ్చని ఆయన చెప్పారు. రెండు బొలెరో వాహనాలను సీజ్ చేసి.. ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు మీడియాకు వివరించారు. బొలెరో వాహనాల కింది భాగంలో బాక్సులాంటి నిర్మాణం ఏర్పాటు చేసి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులు ముగ్గురూ.. మహారాష్ట్రకు చెందిన తమ యజమానులు హనుమాన్ మోహిత్, సమీర్ గవండేల ఆదేశం మేరకు ఒడిశాలోని జన్ భాయ్ ఏజెన్సీ ప్రాంతంలో ఉండే త్రినాథ్ అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు రవాణా చేస్తున్నట్లు వివరించారు. టాస్క్‌ఫోర్స్ అధికారుల సమాచారం మేరకు వాహనాల తనిఖీ నిర్వహించి గంజాయిని సీజ్ చేసినట్లు ఎస్పి తెలిపారు.

బిజెపి ప్రమాదాన్ని అడ్డుకోవాలి

- ఇండియా కూటమి పార్టీలపై కాంగ్రెస్ వైఖరి సరికాదు
- ఐదు రాష్ట్రాల్లో పొత్తులకు విఘాతం కల్గించి ఏకపక్షంగా వ్యవహరించింది
- ఇబ్రహీంపట్నం ప్రచారంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

చిన్నతుండ్ల, లోయపల్లి సభల్లో పాల్గొన్న రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ ఎన్నికల్లో దేశానికి ప్రమాదకరమైన మతోన్మాద బిజెపిని అడ్డుకుని, సిపిఎం అభ్యర్థులకే తమ ఓటు వేసి అసెంబ్లీకి పంపించాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు కోరారు. బిజెపి పట్ల బిఆర్‌ఎస్ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలన్నారు. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో కాంగ్రెస్ ఏకపక్షంగా వ్యవహరించిందని చెప్పారు. బిజెపిని అడ్డుకోవాలంటే కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సిపిఎం అభ్యర్థి యాదయ్యని గెలిపించాలని కోరుతూ చేపట్టిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి వ్యవహరిస్తున్న తీరు దేశానికి చాలా ప్రమాదకరమన్నారు. కేంద్రంలో అధికారం చేపట్టే ప్రభుత్వంలో ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత ఉంటుందని, అందులో బిఆర్‌ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని కెసిఆర్ ప్రకటిస్తున్నారని అన్నారు. కానీ దేశంలో ఎవరికి మద్దతు ఇస్తారనే విషయంలోనే ఆయనకే స్పష్టత లేదని, ఇప్పటికైనా వారి నిర్ణయాన్ని ప్రకటించాలని తెలిపారు. అంతేకాకుండా, బిజెపి పట్ల కాంగ్రెస్ కఠినమైన వైఖరిని తీసుకోవాలన్నారు. లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో ఏర్పడిన ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీల పట్ల కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకు గురి చేస్తుందన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణలో సీట్ల సర్దుబాటులో మోసం చేసిందని, ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించుకున్నదని చెప్పారు. ఇదే విషయంపై అఖిలేష్ యాదవ్ సైతం ఆందోళన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా వామపక్షాలను మోసం చేసిందని చెప్పారు. బిజెపిని ఓడించేందుకు కాంగ్రెస్ అడ్డు పుల్లలు పెడుతున్నట్టు అర్థమవుతుందన్నారు. కీలకమైన ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ వైఖరి సరైనది కాదన్నారు. అసెంబ్లీలో వామపక్షాల ప్రాతినిధ్యం అవసరం ఉందని, రాష్ట్రవ్యాప్తంగా పోటీచేస్తున్న 19మంది సిపిఎంలకు ఓటేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, జగదీష్, మండల కార్యదర్శి సిహెచ్ జంగయ్య, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్, నాయకులు రామకృష్ణారెడ్డి, ఆనంద్, పురుషోత్తం తదితరులున్నారు.

కమ్యూనిస్టులు చేసిన పోరాటాలతోనే బడుగు, బలహీన వర్గాలకు భూములు దక్కాయని రాఘవులు అన్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం చిన్నతుండ్ల, మంచాల మండలం లోయపల్లి గ్రామాల్లో సిపిఎం అభ్యర్థి పగడాల యాదయ్య ప్రచార సభల్లో రాఘవులు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ కృష్ణమూర్తి భూస్వాములకు, వ్యతిరేకంగా పోరాడి ఎంతోమంది పేదలకు భూమిని పంచిపెట్టారని గుర్తుచేశారు. వెట్టిచాకిరి నశించాలని, దున్నేవాడికే భూమి కావాలనే నినాదంతో కమ్యూనిస్టు పార్టీ పనిచేసిందన్నారు. కానీ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు భూ బకాసురుల్లా వాటిని లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిని ఓడించేందుకు.. కమ్యూనిస్టు అభ్యర్థి పగడాల యాదయ్యను గెలిపించాలని కోరారు.

కీచక ప్రిన్సిపల్‌ను కఠినంగా శిక్షించాలి

- ఐద్వా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో 142 మంది విద్యార్థునులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపల్ కర్తార్ సింగ్‌ను కఠినంగా శిక్షించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. హర్యానా రాష్ట్రంలోని జింద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న అమ్మాయిలపైన పాఠశాల ప్రిన్సిపల్ కర్తార్‌సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడటం సభ్యసమాజం తలదించుకునేలా చేసిందని తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులు చెప్పుకోలేని విధంగా మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి వేయడం అత్యంత పాశవిక చర్య అని విమర్శించారు. విద్యా బుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన విద్యాలయంలో ఇటువంటి ఘటన జరగటం శోచనీయమని పేర్కొన్నారు. మహిళా కమీషన్లు, ప్రజాప్రతినిధులు ఈ విషయమై తగిన విధంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలు, బాలికలకు భద్రత లేదని తెలిపారు.

పివి పేరు ఎత్తే అర్హత కాంగ్రెస్‌కు లేదు..

- కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు పేరు ఎత్తే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఓ జాతీయ వార్తా సంస్థతో మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడైన పివిని కాంగ్రెస్ పార్టీ ఘోరంగా అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానిగా పని చేసిన నాయకుడికే పార్టీ టికెట్ ఇవ్వలేదని ఆరోపించారు. చనిపోయిన వ్యక్తిని గౌరవించాలన్న కనీస మర్యాద లేకపోగా ఆయన పార్థీవదేహాన్ని ఎఐసిసి కార్యాలయానికి రానివ్వకుండా అడ్డుకున్న సంగతిని తెలంగాణ ప్రజలు మర్చిపోరని అన్నారు. .పీవీ కుటుంబానికి కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం పివి నరసింహారావు శతజయంతిని ఘనంగా జరపడంతోపాటు భారతరత్న ఇవ్వాలని కోరిందని గుర్తు చేశారు. ఎన్నడూ ఉద్యమం చేయని..ఉద్యోగం చేయని, రాహూల్ గాంధీ యువత గురించి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. రాహుల్ ఒక రాజకీయ నిరుద్యోగి.. ఆయన ఉద్యోగం కోసం నిరుద్యోగుల్ని రెచ్చగొట్టి చిచ్చుపెట్టాలని చూస్తున్నాడని ఆయన విమర్శించారు.

అప్పుల రాష్ట్రంగా మార్చారు

- ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం
- బిజెపి, బిఆర్‌ఎస్, ఎంఐఎం ఒక్కటే
- ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే

సభలో మాట్లాడుతున్న ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ అవినీతి, అక్రమాలతో మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రంగారెడ్డి ఆమనగల్ పట్టణంలో కల్వకుర్తి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రాజెక్టుల ముసుగులో రూ.5.70 వేల కోట్ల అప్పులు బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిందని, దాంతో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి నెత్తిపై రూ.1.50 లక్షల అప్పు ఉందని తెలిపారు. నిరుపేద కుటుంబాల రైతులకు 70 లక్షల ఎకరాలు అసైన్డ్ భూములు పంచిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతల పాలనతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి పేద, మధ్యతరగతి కుటుంబాలు వీధిన పడ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ వ్యాప్తంగా బడుగు, బలహీన తరగతులకు అండగా నిలిచే ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీ పథకాలను తూచ తప్పకుండా అమలు చేస్తామని స్పష్టంచేశారు. బిజెపి, బిఆర్‌ఎస్, ఎంఐఎం ముగ్గురు ఒక్కటేనన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్.. భూ, ఇసుక, మైనింగ్ మాఫియాలతో చేతులు కలిపి అవినీతి అక్రమంగా రూ.లక్షల కోట్లు సంపాదిస్తూ అప్పుడప్పుడు ఒక కొత్త పథకాన్ని తెరపైకి తెచ్చి ప్రజలను మభ్య పెడ్తున్నారని ఆరోపించారు. ఇలాంటి నాయకులను తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండే కల్వకుర్తి శాసన సభ్యునిగా కసిరెడ్డి నారాయణరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, సీడబ్ల్యుసి సభ్యులు చల్లా వంశీచంద్ రెడ్డి, పిసిసి అధికార ప్రతినిధి బాలాజీసింగ్, ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి మల్లు రవి, పిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు చల్లా నర్సింహ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అప్పుల కుప్పగా తెలంగాణ

- కాగజ్‌నగర్ సభలో యుపి సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంపన్న రాష్ట్రం తెలంగాణ.. కెసిఆర్ పాలనలో అవినీతిలో కూరుకుపోయి అప్పుల కుప్పగా మారిందని యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడామైదానంలో శనివారం రామరాజ్య స్థాపన సంకల్పసభలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అంటే అవినీతి బంధువుల సమితి అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలను కేసీఆర్ పక్కన బెట్టారని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి పథంలో నడవాలంటే బిజెపి గెలవాలని, డబుల్ ఇంజన్ సర్కార్ రావాలన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని, వీరిద్దరి కామన్ ఫ్రెండ్ ఎంఐఎం అని తెలిపారు. యూపీలో ఒకే ఒక్క సీటు గెలిచిన బీఎస్పీ సిర్పూర్‌లో గెలుస్తుందా అని ప్రశ్నించారు. సిర్పూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బిజెపి అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. హరీష్‌ను ఎన్నికల్లో ఆశీర్వదించాలని, జనవరి 22 తర్వాత రామమందిర దర్శనానికి ఎమ్మెల్యే హరీష్‌తో వచ్చి రాముడి ఆశీర్వాదం పొందాలని తెలిపారు. అభ్యర్థి పాల్వాయి హరీష్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, దోపిడీదారులకు అడ్డాగా సిర్పూర్‌ను మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తనను నియోజకవర్గ ప్రజలు ప్రతిపక్షంగా ఉండాలని తీర్పునిచ్చారని, నిస్వార్థసేవకై మీలో ఒకడిగా నిలబడ్డానని, ఈ సారి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

బందోబస్తును సమీక్షించిన డిజిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల చివరి ప్రచార ఘట్టానికి రెండు రోజుల్లో తెరపడనుండటం, మరోవైపు పార్టీల అగ్రనేతలు ప్రచార ఘట్టంలోకి దూకటంతో బందోబస్తును నిర్వహించటంలో పోలీసు ఉన్నతాధికారులు సతమతమవుతున్నారు. శనివారం నుంచే ప్రధాని మోడీ మొదలుకొని కాంగ్రెస్, బిజెపి, బీఆర్‌ఎస్, బిఎస్పీతో పాటు కమ్యూనిస్టు పార్టీల అగ్రనేతలు తమ అభ్యర్థుల గెలుపు కోసం శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకపక్క బహిరంగ సభలు, మరోపక్క రోడ్‌షోలు, ఇంకోపక్క కార్నర్ మీటింగ్‌లతో హోరెత్తిస్తున్నారు. ప్రచారానికి వివిధ పార్టీలు లక్షలాది మంది ప్రజలను సమీకరించి తమ బలాన్ని చాటుకోవటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాయి. వీరి లక్ష్యమంతా ఎట్టి పరిస్థితుల్లోనూ తమ అభ్యర్థులను గెలిపించుకోవాలనే లక్ష్యంపై ఉండగా.. వీరి హోరు ఎక్కడ శాంతి, భద్రతల సమస్య తలెత్తుందోనన్న ఆందోళనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తున్నది.

వచ్చే రెండ్రోజుల పాటు బస్తీలు, నగరాలు, పట్టణాలు, గ్రామాల వరకు ఈ ప్రచార హోరు సాగుతుండటంతో వీరికి బందోబస్తును నిర్వహించటంలో సాయుధ బలగాలను సమకూర్చటంలో పోలీసు ఉన్నతాధికారులు తలమునకలవుతున్నారు. ముఖ్యంగా, రాజకీయ ప్రత్యర్థుల మధ్య ఆవేశకావేశాలున్న ప్రాంతాల్లో, మత కలహాలు చెలరేగే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బందోబస్తును రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ శనివారం అధికారులతో సమీక్షించారు. రాష్ట్రానికి చెందిన దాదాపు 47 వేల మంది పోలీసులతో పాటు కేంద్రానికి చెందిన 374 కంపెనీల సాయుధ పోలీసు బలగాలను ప్రచార చివరి ఘట్టంలో విస్తృతంగా వినియోగించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ముఖ్యంగా, ప్రాణాలకు ముప్పు ఉన్న అభ్యర్థుల భద్రత విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఇంకోవైపు, రాష్ట్ర సరిహద్దులు, ఛత్తీస్‌గఢ్‌కు ఆనుకోని ఉన్న ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై కూడా గట్టి నిఘా వేసి ఉంచాలని కూడా ఆయన ఆదేశించారు. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు రాష్ట్ర సరిహద్దుల్లోకి ప్రవేశించకుండా అక్కడి పోలీసు ఉన్నతాధికారులతో కూడా సమన్వయం కావాలని ఆయన ఆదేశించారు. అవసరమైతే అదనపు పోలీసు బలగాల కోసం పోలీసు హెడ్‌క్వార్టర్స్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. మొత్తానికి ప్రచారా చివరి ఘట్టంలో ఎన్నికల నియమావళిని ఏ పార్టీ అభ్యర్థులు కూడా ఉల్లంఘించకుండా కఠినంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల్లో ఎన్నికల నియమాల ఉల్లంఘనతో పాటు నమోదైన ఇతర క్రిమినల్ కేసుల గురించి ఆయన సమీక్ష జరిపారు.

సభలో అభివాదం చేస్తున్న అమిత్ షా

ఎంఐఎం చేతిలో బిఆర్‌ఎస్ స్టీరింగ్

- అమిత్ షా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఆర్‌ఎస్ కారు స్టీరింగ్ ఎంఐఎం ఒవైసి చేతిలో ఉందని, దాన్నుంచి త్వరలోనే తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బిజెపి ఆధ్వర్యంలో జరిగిన సకల జనుల విజయ సంకల్ప సభకు ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలోనూ బిజెపి గెలిస్తేనే దేశానికి భద్రత సాధ్యమవుతుందన్నారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ గెలిస్తే ఎంఐఎం వంటి మతోన్మాద శక్తులకు అవకాశం ఇచ్చినట్టే అవుతుందని, బిఆర్‌ఎస్‌కు ఓటేస్తే ఒవైసికి వేసినట్టేనని చెప్పారు. బిజెపి అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తామన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో అవినీతి అరాచకం రాజ్యమేలుతోందని, పేపర్ లీకేజీలు, నిరుద్యోగం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలకు కెసిఆర్ సర్కారే కారణమన్నారు. బిసిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పిన ఘనత బిజెపిదేనని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్ గౌడ్, రాష్ట్ర నాయకులు గోదావరి అంజిరెడ్డి, జిల్లా నాయకులు సహదేవ్, బైండ్ల కుమార్, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఐఇఇఇ 10 పిఇఎస్ గ్లోబల్ వర్క్‌షాప్

హైదరాబాద్ : "స్మార్ట్ టెక్నాలజీస్ ఇన్ పవర్ అండ్ ఎనర్జీ సిస్టమ్స్" అంశంపై రెండు రోజులపాటు జరిగిన ఐఇఇఇ ఆర్10 పిఇఎస్ ఇండియా 4వ వార్షిక గ్లోబల్ వర్క్‌షాప్ ముగిసింది. ఐఇఇఇ యంగ్ ప్రొఫెషనల్స్ అండ్ ఉమెన్ ఇంజనీరింగ్ కోసం 24, 25 తేదిల్లో నిర్వహించిన ఈ సదస్సులో 12 అంశాలపై చర్చించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో పిఇఎస్ ఛాప్టర్ హైదరాబాద్ ప్రతినిధి ఎస్‌విఎన్‌ఎల్ లలితా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇడి రాజేష్ శ్రీవాస్తవా, ట్రాన్స్‌కో ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ టి జగత్ రెడ్డి పాల్గొనగా.. జి నారాయణమ్మ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ టెక్నలాజీ అండ్ సైన్స్ సిల్వర్ పార్ట్‌నర్‌గా వ్యవహారించింది.

కాంగ్రెస్‌కు ఓటేస్తే పదేళ్లు వెనక్కి

- ప్రాజెక్టును ఇసుక మీద కాకుండా నెత్తి మీద కడతారా..?
- కాంగ్రెస్, బిజెపి అధికారంలోకి వస్తే కరెంటు కష్టాలు
- గ్యారెంటీలేని స్కీమ్‌లతో ప్రజలకు ఇక్కట్లు : హరీశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఓటర్లు కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మి ఓటేస్తే.. రాష్ట్రం పదేండ్లు వెనక్కిపోతుందని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, బిజెపి అధికారంలోకి వస్తే కరెంటు కష్టాలు, మోటార్లకు మీటర్లు తప్పవని, గ్యారంటీ లేని స్కీమ్‌లతో ప్రజలకు కష్టాలు తప్పవని హెచ్చరించారు. వరంగల్ జిల్లా నెక్కొండ, యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామాల్లో శనివారం నిర్వహించిన రోడ్ షోల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారం కోసం కాంగ్రెస్, బిజెపిలు ఎంతకైనా తెగిస్తున్నాయని, గతంలో ఏనాడు ప్రజల బాగోగులు పట్టించుకోని ఈ నేతలు ఎన్నికల వేళ ఎక్కడలేని ప్రేమ ఒలకపోస్తున్నారన్నారు. మార్పు రావాలని కోరుతున్న కాంగ్రెస్ బూటకపు ప్రచారంతో విషవలయంలో పడిపోవద్దని ఓటర్లను అప్రమత్తం చేశారు. ఈ గడ్డమీద పుట్టిన బిఆర్‌ఎస్ కావాలా? ఢిల్లీలో పుట్టిన జాతీయ పార్టీలు కావాలా? అని ప్రశ్నించారు. నర్సంపేటలో పెద్దిని గెలిపించిన నెల రోజుల్లోనే నెక్కొండకు సివిల్ ఆస్పత్రి మంజూరుతోపాటు నెక్కొండను మున్సిపాలిటి చేయిస్తామన్నారు.

గ్యారెంటీ లేని కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలి

యాదాద్రి భువనగిరి జిల్లా చీకటిమామిడి గ్రామంలో జరిగిన రోడ్ షోలో మంత్రి మాట్లాడుతూ.. రైతుల జోలికొస్తే ఊరుకునే పరిస్థితి లేదని, కెసిఆర్‌కు రైతులంటే ఎంతో ప్రేమని అన్నారు. ఆలేరు నియోజవర్గంలో ఐటి పరిశ్రమలు తెచ్చే బాధ్యత తనదని తెలిపారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని కెసిఆర్ అద్భుతంగా కట్టించారన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ఎక్కడైనా కరెంటు తీగలు పట్టుకొని 24 గంటల కరెంటు వస్తుందో లేదో తెలుస్తుందని కోమటిరెడ్డి, రేవంత్‌కు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఇచ్చింది ఉచిత కరెంటు కాదని, ఉత్తుత్తి కరెంట్ అని విమర్శించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ గొంగడి మహేందర్ రెడ్డి, జెడ్పీ చైర్మెన్ సందీప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్యగౌడ్, కల్లూరు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లికి ఆటో యూనియన్ల మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మల్కాజిగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావుకు ఆటో యూనియన్లు మద్దతు తెలిపాయి. శనివారం ఆనంద్‌బాగ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్‌టియు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మైనంపల్లికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నాయకులు సతీష్ కుమార్, గుండా నిరంజన్, ఆటో యూనియన్ నాయకులు బాలరాజు యాదవ్, సంపత్‌రెడ్డి, రాజశేఖర్, సమీర్, అబ్బాస్, రవి తదితరులు పాల్గొన్నారు.